పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలి

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన బల్దియా అధికారులు, మజ్లిస్ నాయకులతో కలిసి హకీంపేట్, న్యూ హకీంపేట్, ఎస్ఎస్ఎఫ్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో మధ్యలో ఆగిపోయిన అభివృద్ధి పనులు, రోడ్లపై నిలిచి ఉన్న బురదను చూసి అధికారులపై మండిపడ్డారు. ప్రజా సమస్యలను తీర్చడానికి తాను ప్రభుత్వం నుంచి నిధులు సాధించి అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నాని అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు సకాలంలో పూర్తి కావడం లేదన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గత రెండు నెలల నుంచి తాను రానున్న వర్షాకాలంలో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను కోరుతున్నానన్నారు. అయితే అధికారుల నుంచి స్పందన మాత్రం నామమాత్రంగా ఉంటుందని ఆయన అన్నారు. డ్రైనేజీలు పొంగిపోర్లడం, సర్వసాధారణం అయిపోయిందని ఆయన అన్నారు. రోడ్లపై గుంతలకు ప్యాచ్‌వర్క్‌లు జరగడం లేదని ప్రజా సమస్యలను పట్టించుకోకుండా పలువురు అధికారులు కార్యాలయాలకే పరిమితమువుతున్నారన్నారు. బస్తీలు, కాలనీల్లో తన వెంట పర్యటించాలని కోరినప్పుడు మాత్రమే అధికారులు వస్తున్నారని ఆయన పేర్కొన్నారు.


హకీంపేట్‌లో డ్రైనేజీ లైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

‘తొలకరి చినుకులు’ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆకెళ్ల శివప్రాద్

గన్‌ఫౌండ్రీ: కర్ణాటక తెలుగు రచయితల సమైఖ్య ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ సింగూరు నరేంద్రబాబు రచించిన ‘తొలకరి చినుకులు’పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ రచయిత ఆకెళ్ల శివప్రసాద్ మాట్లాడుతూ..చల్లని సిరా అక్షరాల స్పర్శతో వేడెక్కించగలిగిన కవిత రచన అని తెలిపారు. ఈ పుస్తకం చక్కటి పదాలతో హృదయాన్ని కదిలించే విధంగా ఉందని కొనియాడారు. రాబోయే రోజుల్లో కథల సంపుటిని రచయిత తీసుకువస్తానని తెలపడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పి.చంద్రశేఖర్ ఆజాద్, కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య అధ్యక్షుడు మరగంటి శ్రీనివాస్, వైఎస్సార్ శర్మ, పాత్తూరి సీతారామరాజు, తిరునగరి శ్రీనివాస్, శైలజ మిత్ర, లహరి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సన్మానం

జియాగూడ: కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు గోపిశెట్టి ప్రమోద్ ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి ప్రమోద్ మాట్లాడుతూ.. కేంద్ర నిధులతో తెలంగాణ రాష్ట్రానికి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అలాగే బుధవారం సాయంత్రం బండి సంజయ్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్న దృష్ట్యా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికి ఊరేగింపుగా బయల్దేరుతార న్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు కె.నర్సింగ్‌గౌడ్ పాల్గొన్నారు.


బండి సంజయ్‌ను సన్మానిస్తున్న గోపిశెట్టి ప్రమోద్

చెత్తను తరలించండి


గోల్కొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్త

గోల్కొండ: గోల్కొండ రేతిగల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గేటు ముందు, ప్రహరీ పొడవునా చెత్త డంపింగ్ జరుగుతుంది. అయితే ఈ చెత్తను తరలించకుండా అలాగే వదిలేస్తున్నారు. దీంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. గోల్కొండలో పారిశుధ్యం పనులను ఎక్సోరా అనే సంస్థ వారు నిర్వహిస్తున్నారు. అయితే ఇక్కడ జరుగుతున్న చెత్త డంపింగ్, చెత్త తరలింపు వారి ఇష్టారాజ్యంపైనే జరుగుతుందని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చెత్త డంపింగ్‌తో పాటు చెత్త తరలింపును పారిశుధ్యం అధికారులు పరిశీలించాలని విద్యార్థులు సైతం కోరుతున్నారు.

నులిపురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు

యాకుత్‌పురా: నులిపురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వైద్య విధాన పరిషత్ సురాజ్‌భాన్ క్లస్టర్ ఎస్‌పీహెచ్‌ఓ డాక్టర్ సునందా, విద్యాశాఖ చార్మినార్ మండల డిప్యూటీ ఈఓ నెహ్రూబాబు తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొన్ని వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం యాకుత్‌పురా ప్రభుత్వ పాఠశాలలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నులిపురుగుల దినోత్సవం రోజున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు ఇంటి వద్ద ఉండే చిన్నారులకు ఉచితంగా మాత్రలను పంపిణీ చేయనున్నామన్నారు. ఈ సమావేశంలో యాకుత్‌పురా-2. దారుషిఫా, అజంపురా, యాకుత్‌పురా-1 యూపీహెచ్‌సీ కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ ఆయేషా ముద్దాసీర్, తబసుం, అప్సా, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో డిప్యూటీ ఈఓ, వైద్యాధికారులు

సాంస్కృతిక కళల వైపు చిన్నారులను ప్రోత్సహించండి


ఆమనికి స్వర్ణ కంకణాన్ని ప్రదానం చేస్తున్న దైవాజ్ఞశర్మ తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి యువతరాన్ని సాంస్కృతిక కళల వైపు ప్రోత్సహించాలని హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ ప్రత్యేక అధికారి డాక్టర్ ఎ.శ్రీధర్ అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో నటరాజ్ అకాడమీ, మనం ఫౌండేషన్ల ఆధ్వర్యంలో 10 సంవత్సరాల ప్రజా పండుగ పేరిట సాంస్కృతిక సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ సేవకురాలు ఆమని ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎం.ఆమని మలుగుకి స్వర్ణ కంకణాన్ని ప్రదానం చేశారు. అంతకు ముందు తెలంగాణ వీధి నాటకాలు, డప్పుల సవ్వడి, సాంప్రదాయ నృత్య మాలిక, జానపద ఉత్సవాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అదేవిధంగా పలువురు నృత్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు జి.భరత్‌కుమార్, కాండర్ పాఠశాలల చైర్మన్ ఈ మల్లారెడ్డి, మనం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆర్ఎస్ కుమార్, నటరాజ్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల గిరి పాల్గొన్నారు.

సన్మానం

అబిడ్స్: ఎమ్మెల్సీగా గెలుపొందిన తీన్మార్ మల్లన్నను కాంగ్రెస్ నాయకులు మంగళవారం సన్మానించారు. నగర కాంగ్రెస్ పార్టీ నాయకుడు జగన్ గౌడ్, కొండ రాఘవేంద్ర, సాయినాథ్‌గౌడ్‌లు ఆయనను కలిసి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీగా గెలుపొందడం ఎంతో సంతోషకరమన్నారు.


తీన్మార్ మల్లన్నను సన్మానిస్తున్న జగన్‌గౌడ్

చెట్టు కూలి వ్యక్తికి గాయాలు



గోల్కొండ: గోల్కొండ ఎండిలైన్స్‌లో ఓ భారీ చెట్టు నేలకూలింది. ఈ ఘటనలో ఓ ఇంటి గోడ పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో గోడపక్కన నిలుచుకున్న ఓ వ్యక్తికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గోల్కొండ ఎండిలైన్స్ ఎంజీపీ డైరీ ప్రొడక్స్ ఎదురుగా ఉన్న ఓ భారీ వృక్షం పెద్ద చప్పుడుతో ఓ ఇంటి ప్రహరీపై కూలింది. అయితే ఆ సమయంలో గోడ పక్కన నిలిచి ఉన్న ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి.

కోట బోనాలకు భారీ ఏర్పాట్లు

- ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉత్సవాలు
- ముస్తాబవుతున్న అమ్మవారి ఆలయం
- జులై 7వ తేదీ నుంచి బోనాల జాతర షురూ..


ఆలయ మెట్ల వద్ద అలంకరణ

గోల్కొండ: బోనాల పండుగ అంటే గుర్తుకు వచ్చేది గోల్కొండ కోట. తెలంగాణలో గోల్కొండ కోట నుంచే బోనాల ఉత్సవాలు మొట్టమొదటిసారిగా ప్రారంభమవుతాయి. తెలంగాణ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం గోల్కొండ కోటలో కోలువుదీరి ఉన్న శ్రీ జగదాంబిక మహంకాళీ అమ్మవార్ల బోనాలను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో బోనాలకు మరింత ప్రచారం లభించింది. కుతుబ్‌షాహీ రాజుల కాలం నుంచి కోటలో అమ్మవార్లకు బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అసఫ్‌జాహీ వంశానికి చెందిన నిజాం పాలకులు సైతం ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించే వారని ప్రతీతి. కోటలో జగదాంబిక అమ్మవారు, మరోవైపు మహంకాళీ అమ్మవార్లు కొలువుదీరి ఉన్నారు. అమ్మవార్ల దర్శనానికి తెలంగాణ నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. అమ్మవారికి మొత్తం తొమ్మిది పూజలు నిర్వహిస్తారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆధ్వర్యంలో జరిగే ఈ పూజల సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకుంటారు.


ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం

ప్రభుత్వ ఆధ్వర్యంలో..

తెలంగాణ ఆవిర్భావం అనంతరం గోల్కొండ కోట అమ్మవార్ల ఆషాఢ మాసం జాతర ఉత్సవాలు దేవాదాయ శాఖ వారు నిర్వహిస్తున్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతి ఏటా బోనాల సందర్భంగా అమ్మవారికి హుండీ ద్వారా ఆదాయం పెరుగుతూనే ఉంది. తెలంగాణ ప్రభుత్వం అమ్మవారికి ప్రత్యేకంగా భారీ ఊరేగింపుతో పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. రాష్ట్ర మంత్రి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు భారీ ఊరేగింపుతో అమ్మవారికి సమర్పించడం జరుగుతుంది.

వృత్తిపని వారి పాత్ర కీలకం..

కోట బోనాల నిర్వహణలో వృత్తిపని వారి పాత్ర ఎంతో కీలకం. కమ్మరి, వడ్రంగి, కంసాలి, చాకలితో పాటు వివిధ రకాల కులవృత్తులకు చెందిన పనివారు అమ్మవారి ఆలయ అలంకరణ, ఇతర పనులు నిర్వహిస్తుంటారు. కాగా వృత్తి పని వారు వంశపారపర్యంగా విధులు నిర్వహించడం ప్రత్యేకం. వీరి సేవలను గుర్తించిన దేవాదాయ శాఖ వృత్తిపని వారికి గుర్తింపు కార్డులు ఇవ్వడమే కాకుండా బోనాల సందర్భంగా వారికి గౌరవ వేతనం కూడా ప్రతి యేటా ఇస్తున్నారు.

మొత్తం తొమ్మిది పూజలు..

అమ్మవారికి ఆషాఢ బోనాల జాతర ఉత్సవా సందర్భంగా మొత్తం తొమ్మిది పూజలు నిర్వహిస్తారు. మొదటి పూజ జులై 7వ తేదీ ఆదివారం, రెండో పూజ జులై 11 గురువారం, మూడవ పూజ జులై 14 ఆదివారం, నాల్గోవ పూజ జులై 18 గురువారం, అయిదవ పూజ జులై 21 ఆదివారం, ఆరవ పూజ జులై 25వ తేదీ గురువారం, ఏడవ పూజ జులై 28వ తేదీ ఆదివారం, ఎనిమిదవ పూజ ఆగస్టు 1న గురువారం, చివరిదైన తొమ్మిదవ పూజ ఆగస్టు 4వ తేదీన ఆదివారం ఉంటుంది.

కేరళ గవర్నర్‌కు ఈద్ ముబారక్



చార్మినార్: కేరళ గవర్నర్ ఆరీఫ్ మహ్మద్ ఖాన్‌ను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసినట్లు బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు. నగరంలోని రాజ్‌భవన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి బొకే అందజేసి ఈద్-ఉల్- అదా ఈద్ ముబారక్ తెలియజేసినట్లు ఆయన తెలిపారు.

ప్రొఫెసర్ కోదండరామ్‌కు సత్కారం



కోదండరామ్‌ను సత్కరిస్తున్న జగదీశ్వర్, ఎస్ఎం ముజీబ్ హుస్సేన్ తదితరులు

అబిడ్స్: ప్రొఫెసర్ కోదండరామ్‌ను టీఎన్జీఓస్ కేంద్ర సంఘం యూనియన్ నూతన కమిటీ ఘనంగా సత్కరించారు. నూతనంగా ఎన్నికైన సందర్భంగా నూతన అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని, 4వ తరగతి అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్, జిల్లా సభ్యులు బొల్లిగడ్డ శంకర్, ఆర్‌టీఏ అధ్యక్షుడు అరుణ్ ఆయనను సత్కారం చేశారు.

బాలిక అదృశ్యం


నబియా ఫాతిమా

గౌలిపురా: జిరాక్స్ కోసమని ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం ..మొఘల్‌పురా సుల్తాన్‌షాహీ ప్రాంతానికి చెందిన మహమ్మద్ సలీం కూతురు నబియా ఫాతిమా (17) ఈనెల 15న మధ్యాహ్నం 2 గంటలకు తన సోదరి ఆయాత్నూర్‌తో కలిసి ఓల్డా హోటల్ వద్ద అరబిక్స్ నోట్స్ జిరాక్స్ చేసుకునేందుకు వెళ్లారు. జిరాక్స్‌లు తీసుకున్న నబియా ఫాతిమా కనిపించకుండా పోయింది. ఈ విషయాన్ని ఆయాత్నూర్ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులు తెలిపింది. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కూతురు కనిపించడం లేదని సలీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సారూ.. దయ చూపరూ!

నెల రోజులుగా మురుగునీటితో సావాసం

నాంపల్లి: నెల రోజులుగా ఓ కుటుంబం మురుగునీటిలోనే జీవనం కొనసాగిస్తోంది. వీధిలోని మ్యాన్‌హోల్ మురుగునీరు ఇంట్లోకి ప్రవేశిస్తోంది. 11-1-196/1 ఇంట్లోకి చేరుకున్న మురుగునీటికి అడ్డుకట్ట వేయాలని బాధిత కుటుంబం రెడ్‌హిల్స్ వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు. మే 22న ఇంట్లోకి మురుగునీరు వస్తోందని అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేయగా ఆ ఇంటి వద్దకు వెళ్లిన సిబ్బంది ఐదు వేలు ఇస్తేనే..పనిచేస్తామని డిమాండ్ చేశారు. ఆ కుటుంబ సభ్యులతో బేరం కుదరకపోవడం వాటర్ వర్క్స్ సిబ్బంది పనిచేయకుండా తిరిగి వెనక్కి వెళ్లిపోయారని ఇంటి యజమాని, రిటైర్డ్ ఉద్యోగి ప్రకాష్ సింగ్ ఆరోపించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా నీటి బిల్లులను చెల్లించే తమ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తాము పడుతున్న బాధను అర్థం చేసుకుంటారని, తమ కుటుంబ సభ్యులు వ్యాధుల బారినపడక ముందే మురుగునీటి బాధ నుంచి విముక్తి కల్పించాలని ప్రకాష్ సింగ్ విజ్ఞప్తి చేశారు.


దోభీఘాట్‌లో ఓ ఇంట్లోకి చేరుకున్న మురుగునీరు

‘ఆషాఢ మాసం బోనాలు ఘనంగా నిర్వహిస్తాం’


రాకేశ్ తివారీ

చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని సుల్తాన్‌షాహి జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేశ్ తివారీ అన్నారు. కొన్నేళ్లుగా ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని..ఈసారి కూడా మరింత ఘనంగా బోనాల జాతర ఉత్సవాలను నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జులై 28న అమ్మవారికి బోనాల సమర్పణ, 29న అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు.

నూతన కార్యవర్గం..

ఈసారి జరిగే ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు ఆలయ కమిటీ నూతన కార్యవర్గం ఏర్పడింది. సుల్తాన్‌షాహి జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్‌గా రాకేశ్ తివారీ నియమితులయ్యారు. అధ్యక్షుడిగా ఆలకంటి అమరేశ్వర్, ఉపాధ్యక్షులుగా ఎం.వరదరాజ్, జే.శ్రీరాములు చారి, ప్రధాన కార్యదర్శిగా రాజేష్ తివారీ, సంయుక్త కార్యదర్శిగా ఎం.కృష్ణ ముదిరాజ్, కోశాధికారిగా ఆకుల వేణుగోపాల్, సలహాదారులుగా రంజిత్ సింగ్, పంతులు వెంకటరమణ తదితరులు నియమితులయ్యారని చైర్మన్ రాకేశ్ తివారి తెలిపారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం



అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం జరుగుతుందని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పరమేశ్వరీ సింగ్ పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డిని మంగళవారం ఆమె ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పరమేశ్వరీ సింగ్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంతో పాటు ఖైరతాబాద్ జిల్లా నలుమూలలా పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతాని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, సుదర్శన్, శంకర్ సింగ్, శశిరాజ్ సింగ్, నరేష్ సింగ్, సత్యనారాయణ సింగ్, అనిల్‌కుమార్, శోభ, రాబర్ట్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫ్‌నగర్ ఏసీపీ కిషన్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలి


సునీల్ యాదవ్

అబిడ్స్: కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి ఠాకూర్ అమర్‌సింగ్‌తో, స్థానిక వ్యాపారులతో అమర్యాదగా ప్రవర్తించిన ఆసిఫ్‌నగర్ డివిజన్ ఏసీపీ కిషన్‌కుమార్‌ను సస్పెండ్ చేయాలని గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.సునీల్‌యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో సునీల్‌యాదవ్ మాట్లాడుతూ..ఏసీపీ కిషన్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డికు ఫిర్యాదు చేశామన్నారు. కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జిగా ఉంటూ గతంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన అమర్‌సింగ్‌పై, స్థానిక వ్యాపారులపై ఏసీపీ కిషన్‌కుమార్ దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఏసీపీపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు. అమర్యాదగా ప్రవర్తించిన కిషన్‌కుమార్‌పై విచారణ జరిపే విధంగా పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు బండి సంజయ్ ఆదేశాలు ఇచ్చారని సునీల్ యాదవ్ తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

గోల్కొండ: ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ బి.వి.కె. మూర్తి అన్నారు. ఇందులో భాగంగానే ప్రతినెలా డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన వస్తుందన్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు, కళాశాలల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి సలహాలు, సూచనలు వస్తున్నాయన్నారు. వాటిని పరిశీలించి వారు కోరిన రూట్‌లలో బస్సు సర్వీసులను ప్రారంభించామని ఆయన తెలిపారు. డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమంలో నేడు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తున్నామని ఇందులో తానే స్వయంగా పాల్గొని ఫోన్‌లు చేసిన వారికి అందుబాటులో ఉంటున్నానని తెలిపారు. **9959226133**లో ఫోన్ చేయవచ్చునని ఆయన సూచించారు.

సమాజాభివృద్ధికి కళలే ప్రతిరూపాలు


కళాకారులను సత్కరిస్తున్న రమణాచారి, లక్ష్మీనారాయణ

నాంపల్లి: సర్వ కళాకారుల సంక్షేమ వేదిక ద్వితీయ కళా ప్రదర్శన పబ్లిక్‌గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళా పరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి హాజరయ్యారు. సమాజాభివృద్ధికి కళలు ప్రతిరూపాలని రమణాచారి అన్నారు. ఎక్కడైతే కళలు సంరక్షించబడతాయో అక్కడి సమాజం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. కాబట్టి కళలు, కళాకారులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరమన్నారు. కళాకారులను ఆదుకునేందుకు ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేయడం సంతోషదాయమకన్నారు. ఈ సందర్భంగా వయోధిక కళాకారులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, నృత్య గురువు డాక్టర్ భారతి, కార్యక్రమ నిర్వాహకులు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్ గ్రేడ్-2లకు గ్రేడ్-1గా పదోన్నతులు కల్పించాలి



రవీంద్రనాయక్‌కు సమస్యలు వివరిస్తున్న నాయకులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలోని 6, 7వ జోన్లలో పనిచేస్తున్న ఫార్మసిస్ట్ గ్రేడ్-2లకు గ్రేడ్-1గా పదోన్నతులు కల్పించాలని గవర్నమెంట్ ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ కోరారు. మంగళవారం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీంద్ర నాయక్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నూతనంగా ఏర్పడిన అన్ని మెడికల్ కాలేజీలలో ఫార్మసిస్ట్ గ్రేడ్-1 పోస్టులు సమానంగా ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఫార్మసిస్టులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై డీహెచ్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పన్నుల శాఖలో ప్రమోషన్లు ఇవ్వాలి


మాట్లాడుతున్న మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ తదితరులు

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖలో ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని వాణిజ్య పన్నుల శాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ ముజాహిద్ హుస్సేన్ పేర్కొన్నారు. పలు విభాగాల్లో కొన్ని ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే కల్పించాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా కల్పించాలని గతంలో పలుమార్లు వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్లకు, రెవెన్యూ ప్రిన్సిపాల్ సెక్రెటరీలకు విన్నవించినా స్పందించలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఏసీటీఓలకు గెజిటెడ్ హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న వాణిజ్య పన్నుల శాఖలోని సమస్యలను పరిష్కరించాలని ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

రాయదుర్గం: శేరిలింగంపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడలో సుమధుర అపార్ట్‌మెంట్స్‌లో నెలకొన్న సమస్యలపై అపార్ట్‌మెంట్‌వాసులు, విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమధుర అపార్ట్‌మెంట్స్ వాసులు మాట్లాడుతూ రోజుకి 18 సార్లు కరెంటు పోతోందని, లో ఓల్టేజీ అని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సాధ్యాసాధ్యాలను పరిశీలించి వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు.విద్యుత్ ఏడీఈ చరణ్, ఏఈ వేణుగోపాల్, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా, బీఆర్ఎస్ నాయకులు గణేష్‌ముదిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, సత్యనారాయణ, నరేష్, నారాయణ, గోవింద్, రామిరెడ్డి, సుమధుర అపార్ట్‌మెంట్స్ చైర్మన్ పివిచౌదరి, రామారావు, దేవిరెడ్డి పాల్గొన్నారు.